కీసరగుట్ట ఆలయానికి స్టీల్ హుండీల వితరణ



జ్ఞానేశ్వర్ అందజేసిన స్టీల్ హుండీలతో చైర్మన్ తదితరులు

కీసర: దాతల సహకారంతో కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి నగర శివారులోని బాట సింగారం గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్‌గుప్తా దంపతులు మూడు స్టీల్ హుండీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ... శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనార్థం కీసరగుట్టకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు మున్సిపల్ నిధులను వెచ్చించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని నేతాజీనగర్ కాలనీలో రూ. 19.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్నారు. వన మహోత్సవంలో భాగంగా పలు కాలనీల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముసురేసిన మేడ్చల్

మేడ్చల్: అల్పపీడనం కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మేడ్చల్ ముసురేసింది. రెండవ రోజైన ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం మేడ్చల్ ప్రాంతమంతా వర్షం కురిసింది. ఆదివారం బోనాల పండగ కావడంతో ముసురుతో పండగ చేస్తున్న వారు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా ముసురు కురిసింది. అప్పుడప్పుడు మోస్తారు వర్షం కురిసింది. శని, ఆదివారాల్లో ముసురుతో కూడిన వర్షం నమోదు కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

శామీర్‌పేట్: రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు రైతు పట్టాదారు పాస్ పుస్తకంతో ఆగస్టు 4 లోగా అలియాబాద్‌లోని రైతువేదిక వద్ద సంప్రదించాలని ఏఓ రమేష్ తెలిపారు.

అంబేడ్కర్‌నగర్ మాదిగ సంఘం కార్యవర్గం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ మాదిగ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మంద ఆనంద్, గౌరవ అధ్యక్షులుగా ముక్క నర్సింహ, పెరిక కనకయ్య, మాడుగుల విజయ్, కొంపల్లి వెంకట నర్సయ్య, మేడ స్వామి, కమిటీ సభ్యులుగా ఎర్ర రాము, గడిపే సునీల్, గున్న సంధ్య, మేడ అశోక్, చింత అరుణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ... మాదిగ సంఘం అభివృద్ధి కోసం నూతన కమిటీ అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. బాబు జగ్జీవన్‌రాం కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్, మాదిగ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరాటేతో పరిపూర్ణ ఆరోగ్యం

మేడ్చల్: పిల్లలకు చిన్న వయస్సులో కరాటే వంటి విద్య నేర్పించడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసిక దారుఢ్యం లభిస్తుందని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని యూనివర్సల్369 అకాడమీలో నిర్వహించిన బెల్ట్, సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు విద్యతో పాటు, ఆటలు, కరాటే, కుంగ్‌ఫూ, మార్షల్‌ఆర్ట్స్ వంటి విద్యలు ఎంతో అవసరమని అన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే విద్య ఎంతో దోహదం చేస్తుందని తల్లితండ్రులు తమ పిల్లలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడానికి మొగ్గుచూపాలని అన్నారు. కేఎల్ఆర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు గర్దాస్ నరేదర్, అకాడమీ కోచ్‌లు, యాజమాన్యం పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బలహీనపడ్డ బీజేపీ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో 2024వ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బలహీన పడిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి బీజేపీకి అవసరమైన సీట్లు రాలేదన్నారు. ఇండియా కూటమి బలపడిందని పార్లమెంటులో ఎన్డీఏ కూటమి ప్రతిపక్ష హోదా పొందిందని తెలిపారు. రైతాంగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ ఓటమిపాలైందన్నారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు స్వల్పంగా బలపడ్డాయని, సీట్ల సంఖ్య కూడా పెంచుకుందని అన్నారు. జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ 3 సీట్ల నుంచి ఎనిమిదికి పెరిగిందని చెప్పారు. మతోన్మాద బీజేపీ కూడా 4 సీట్ల నుంచి 8 సీట్లకు పెరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అర్హులైన రైతులందరికీ వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కొమటి రవి, వినోద, అశోక్, కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆవిర్భావం

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ను స్థాపించారు. ముఖ్యఅతిథిగా ఆటో యూనియన్ జిల్లా బాధ్యుడు కృష్ణమూర్తి హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు రూ. 12,500ల భృతి చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నేత జయచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, యాకూబ్‌పాషా, శంకర్‌ముదిరాజ్, జంగయ్య, మంక్యా, బాలు, నరేశ్, నవీన్, ఈశ్వర్, దేవేందర్‌ముదిరాజ్, నవీన్, నరసింహ, మైసయ్య, మల్లేశ్‌గౌడ్, విజయ్ పాల్గొన్నారు.

రోడ్లన్నీ ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం!

వర్షాలకు గుంతలమయమైన రోడ్లు
పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వానం
పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు
మరమ్మతు చేయడంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం





జవహర్‌నగర్, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల పరిధిలో అధ్వానంగా తయారైన రోడ్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగర శివారు పురపాలికలు, పంచాయతీల పరిధిలోని రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారవుతున్నాయి. లోతట్టు కాలనీలు, మురికి వాడలను వరద దాదాపు ముంచెత్తుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పలు చోట్ల డ్రైనేజీలు కాలువలు కూడా దెబ్బతిన్నాయి. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నడవలేని పరిస్థితులు నెలకొన్నాయనడం అతిశయోక్తికాదు.

- బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాల పరిధిలోని దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయంగా మారాయి.
- గతంలో భారీగా పడిన వర్షాలతో బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని తొమ్మిది కిలో మీటర్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. డ్రైనేజీ కాలువలసహా రోడ్ల పనులకు ప్రభుత్వం రూ. 110 కోట్లు విడుదల చేసినా.. పనులు పూర్తి చేయకపోవటంతో రోడ్లు ఛిద్రంగా మారి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్డుపై ఎక్కడికక్కడ నిలిచిపోగా, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో వరద నీరు జోరుగా ప్రవహించటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి శివారుల్లోని పలు గ్రామ పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి.

చెరువుల కబ్జాతో...

- నగర శివారు చెరువు, కుంటలు, శిఖం భూములు, నాలాల స్థలాల కబ్జాల బారినపడ్డాయి. చిన్నపాటి వర్షానికే చెరువుతు కాస్తా నిండి సమీపంలోని కాలనీలు, లో తట్టు ప్రాంతాలు, రోడ్లపైకి నీరు చేరుతోంది.
- చెరువులు, నాలాల భూముల్లో అక్రమ కట్టడాలు పెరిగిపోయాయి. నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, బడంగ్‌పేట్ పురపాలక సంఘాల్లో పలు కాలనీలు, చెంగిచర్లలోని బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్ట ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించటం వల్ల సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

శివారు పురపాలక సంఘాల్లో..

- హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉన్నాయి. ఇవేకాకుండా దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పట్టణాల్లో ప్రజల ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ. 343 కోట్లు వసూలు చేస్తున్నారు. అయినా ప్రజలకు మెరుగైన వసతులు, సేవలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- శివారు ప్రాంతమైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 168 కోట్లు వసూలవుతోంది.
- 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో కూడా పురపాలక సంఘాల ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోపోవటంతో అభివృద్ధి కుంటుపడుతోందనే ఆవేదన సర్వత్రా వ్యక్తం అవుతోంది.



సీఎం సారూ.. రోడ్డు వేయరూ...

జవహర్‌నగర్: సీఎం సార్.. జర రోడ్లు వేయరా ప్లీజ్ అంటూ బురదమయంగా ఉన్న రోడ్లను చూసి చిన్నారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి తాతయ్యా... మా కాలనీకి వెళ్లాలంటే భయంగా ఉంది. ఎక్కడ చూసినా బురదే. పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఇక్కడ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉన్నా పట్టించుకోవడంలేదు. రేవంత్ తాతయ్యా మా కాలనీకి రోడ్లు వేయండి ప్లీజ్...' అంటూ జవహర్‌నగర్‌లోని 28వ డివిజన్ లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన విశ్వజిత్ తన మాటలతో సోషల్ మీడియా వేదికగా వేడుకున్నాడు. ఈ బుడ్డోడి మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాలి.



రోడ్లు వేయమని సీఎంను వేడుకుంటున్న చిన్నారి విశ్వజిత్

బోనమెత్తిన ఊరూవాడ

మేడ్చల్‌లో ఘనంగా బోనాల జాతర



బోనాలతో మహిళలు



రాంపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

మేడ్చల్: అషాఢ మాసం కావడంతో మేడ్చల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలలో వాడవాడలా బోనాల జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, మహంకాళి, ముత్యాలమ్మ తదితర ఏడుగురి దేవతల బోనాల పండగను ఘనంగా జరుపుకొన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న ఏడు గుళ్ల, ఇందిరానగర్ కాలనీలోని పోచమ్మ, వినాయక్‌నగర్ కాలనీలోని ఎల్లమ్మ, అత్వెల్లిలోని పోచమ్మ, దుర్గమ్మ ఆలయాలలో, వివిధ గ్రామాల ఆలయలలో బోనాలను నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసి నెత్తిన పెట్టుకుని తమ ఇళ్ల నుంచి ఆలయాల వరకు ఊరేగింపు నిర్వహించి బోనాలతో ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల శిగాలతో బోనాల జాతర శోభాయమానంగా జరిగింది. ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద అన్ని రాజకీయ పార్టీల నేతల హడావుడి కనిపించింది.

శామీర్‌పేట మండలంలో

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ఊరూరా బోనాల పండగను ఆదివారం నిర్వహించారు. డప్పుల దరువులు, శివసత్తులు శిగాలతో గ్రామాలు మార్మోగాయి. మహిళలు బోనమెత్తి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి పలు గ్రామాల్లో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

గుండ్లపోచంపల్లిలో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలటీలో ప్రజలు బోనాల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మహంకాళీ అమ్మవారికి మహిళలు బోనాలను సమర్పించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర పరిధిలో...

కీసర: మండలంలోని కీసర దాయర, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి తదితర గ్రామాల్లో ఆషాఢ బోనాల జాతరను ప్రజలు వైభవంగా నిర్వహించారు. రాంపల్లిలోని పలు కాలనీల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో బోనాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు నాగేష్‌గౌడ్, పంబాల సరితారమేష్, కళావతి, లక్ష్మీవేణుగోపాల్, గూడురు సబితా ఆంజనేయులు, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శాకంబరిగా కట్టమైసమ్మ




కూరగాయలతో అలంకరించిన కట్టమైసమ్మ, ఘట్‌కేసర్‌లో...

మేడ్చల్: అషాఢ మాస పూజల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మను భక్తులు కూరగాయాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

ఘట్‌కేసర్ పరిధిలో...

ఘట్‌కేసర్: శివారెడ్డిగూడ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆదివారం అమ్మవారిని రకరకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి వరదాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

శివసాయి కాలనీ నూతన కార్యవర్గం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ 4వ వార్డులోని శివసాయి కాలనీ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జంబుల తిరుపతి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, తదితరులు ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను 4వ వార్డు కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ అభినందించారు. కార్యక్రమంలో కాలనీ నేత ఎస్.కె.బాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



కీసర: వనమహోత్సవంలో భాగంగా గోధుమకుంట గ్రామంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేస్తామని గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గోధుమకుంట గ్రామపంచాయతీ పరిధిలోని టీపీఎస్ కృష్ణానగర్ కాలనీలో ఇంటింటికీ 6 మొక్కల చొప్పున మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని సూచించారు.

సందడిగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్: బోనాల పండగలో బోనాల సమర్పణ తర్వాత ప్రసిద్ధి గాంచిన ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో మేడ్చల్, అత్వెల్లిలలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏడు గుళ్ల ఆలయం, అత్వెల్లి దుర్గమ్మ, పోచమ్మ ఆలయాలకు వివిధ కాలనీల నుండి ఫలహారం బండ్లను ఊరేగించి తొట్టెలను సమర్పించారు. గౌరైలను బండ్లకు కట్టి, అమ్మవార్లను ఫలహారం బండిలో పెట్టి కాలనీల నుంచి ఆలయాల వరకు బ్యాండు భజంత్రీలతో, పోతరాజుల నృత్యాల నడుమ ఊరేగించారు. ఆర్టీసీ కాలనీ, అత్వెల్లిలో ఫలహార బండ్ల ఊరేగింపును యువకులు అట్టహాసంగా నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కోడలు క్షమిత తదితర ప్రముఖులు ఊరేగింపులో పాల్గొన్నారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్‌లు మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, సరిత మల్లేష్‌గౌడ్ గణేష్, నాగరాజు, రవీందర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వివిధ యువజన సంఘాల యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అత్వెల్లి పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

వైభవంగా గురుపౌర్ణమి



నాగారంలో...



సాయినాథుడిని దర్శించుకున్న నాగారం ఛైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్: గురుపౌర్ణమిని మేడ్చల్‌లో వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాలతో పాటు పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున అభిషేకాలు, పంచామృతలతో అభిషేకాలు, అర్చనలు, సాముహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవలో భాగంగా సాయినాథుడిని మేడ్చల్ పట్టణంలో ఊరేగించారు. మేడ్చల్ ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు. అత్వెల్లి సాయిబాబా ఆలయం, దత్తాత్రేయ ఆలయాలల్లో భక్తుల సందడి కనిపించింది.

అవుషాపూర్‌లో...

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో వ్యాస పూర్ణిమ (గురు పౌర్ణమి) వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కావేరి ఆధ్వర్యంలో గ్రామంలోని ఉపాధ్యాయులను సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... సమాజంలో చీకటిని పారదోలేవారు గురువులని అన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పోచిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశ్, సాయిలు, ఉపాధ్యాయులు సుధాకర్, కొండల్, శ్రీనివాస్, బాబురావు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ, నాగారం మున్సిపాలిటీలతోపాటు కీసర మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నాగారంలో బాలగోకులం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

గురువు స్థానం పవిత్రం: కోదండరామ్

సంస్కృతి టౌన్‌షిప్‌లో ఘనంగా గురుపౌర్ణమి



మాట్లాడుతన్న కోదండరామ్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమ నాయకుడు కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో గురువులకు ఉన్న స్థానం ఎంతో పవిత్రమైనదన్నారు. సంప్రదాయబద్ధంగా గురుపూజోత్సవాన్ని జరుపుకోవడం శుభప్రదమన్నారు. అనంతరం బేరెడ్డి రాధారెడ్డి సౌజన్యంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురువులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.